
సాక్షి ఒడిశా
మంగళవారం । 6 । జూన్ । 2023



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయంలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన హుండీ ఆదాయాన్ని ఆలయ పాలకవర్గం సోమవారం లెక్కించారు. ఇందులో నగదు రూ.1,92,417లు, బంగారం 950 మిల్లీగ్రాములు, వెండి 3.6 గ్రాములు వచ్చాయని అధికారులు వెల్లడించారు.



ప్రకృతే ప్రమాణం..

- 8లో



అలరనాథ్ దర్శనానికి పోటెత్తిన భక్తులు

- 8లో

న్యూస్‌రీల్

ఏడుగురు జూదరుల అరెస్ట్

- రూ.52 వేల నగదు, 4సెల్‌ఫోన్లు స్వాధీనం



పోలీసు అదుపులో నిందితులు

బరంపురం: జిల్లాలోని బంజనగర్ సబ్ డివిజన్ పరిధి బెల్లిగుంట బ్లాక్ కొలాకుండ గ్రామంలో గత కొద్ది రోజులుగా రహస్యంగా నిర్వహిస్తున్న జూదం అడ్డాపై పోలీసులు దాడి చేశారు. దీనికి సంబంధించి ఏడుగురు పేకాటరాయుళ్లను సోమవారం అరెస్ట్ చేయడంతో పాటు వారి వద్ద నుంచి రూ.52,140ల నగదు స్వాధీనం చేసుకున్నారు. ఐఐసీ అధికారి జిత్రేంద్ర మల్లిక్ అందించిన వివరాల ప్రకారం కొలాకుండ గ్రామంలోని కాళీమాత మందిరానికి సమీపంలో జూదం అడ్డా నిర్వహిస్తున్నట్లు సమాచారం అందింది. ఈ మేరకు బెల్లిగుంట పోలీసులు దాడి చేసి, ఏడుగురిని అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి నగదు, 4 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు.

వివిధ డిమాండ్లపై బీకేఎంయూ నిరసన



ఏడీఎంకు వినతిపత్రం అందిస్తున్న బీకేఎంయూ ప్రతినిధులు

పర్లాకిమిడి: పేదలకు ఇళ్లు మంజూరు చేయడంతో పాటు వృద్ధులు, వితంతువులకు ప్రతి నెలా రూ.5వేల పింఛన్ అందించాలని భారతీయ ఖేత్ మజ్దూర్ సంఘ్(బీకేఎంయూ) ప్రతినిధులు డిమాండ్ చేశారు. అలాగే ముద్రా, డీఆర్ఐ రుణాలు, ప్రధానమంత్రి అవాస్ యోజన పథకాన్ని రూ.5 లక్షలకు పెంచాలని కోరారు. డిమాండ్ల సాధనకు జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ ఎదుట సోమవారం నిరసన వ్యక్తంచేశారు. అనంతరం జిల్లా నాయకులు జెన్న సుభాష్ చంద్రరావు ఆధ్వర్యంలో అదనపు కలెక్టర్(రెవెన్యూ) బీరేంద్రకుమార్ దాస్‌కు వినతిపత్రం అందించారు. నిరసనలో కాశీనగర్, రాణిపేట బస్తీవాసులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్యమే శ్రీరామ రక్ష



సిబ్బందిని అభినందిస్తున్న ఎమ్మెల్యే తారాప్రసాద్

జయపురం: పట్టణ పారిశుద్ధ్యమే ప్రజారోగ్యానికి శ్రీరామ రక్ష అని ఎమ్మెల్యే తారాప్రసాద్ బాహినీపతి అన్నారు. రాష్ట్రప్రభుత్వ 'గరిమ' పథకంలో భాగంగా ఉత్తమ పారిశుద్ధ్య శ్రామికులకు పరిచయ పత్రాలను ఆయన సోమవారం అందించి, అభినందించారు. జయపురం మున్సిపాలిటీ కౌన్సిల్ సభాగృహంలో ఈఓ సిద్ధార్థ పట్నాయక్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడారు. పారిశుద్ధ్య సిబ్బంది విధి నిర్వహణలో చిత్తశుద్ధితో మమేకం కావాలని సూచించారు. రానున్న వర్షాల సీజన్‌లో ప్రజారోగ్యాన్ని కాపాడటంతో గురుతర బాధ్యత వహించాలన్నారు. ప్రధానంగా మురుగు నిల్వ లేకుండా చేయడం, ఎప్పటికప్పుడు చెత్తను తొలగించడం ద్వారా వ్యాధులు వ్యాపించకుండా అరికట్టవచ్చని తెలిపారు. అలాగే ప్రజలు కూడా పారిశుద్ధ్య సిబ్బందికి సహకరించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ నరేంద్రకుమార్ మహంతి, సిబ్బంది, శ్రామికులు, పట్టణ ప్రజలు పాల్గొన్నారు.

వినతుల స్వీకరణ



రాయగడ: వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ స్వాధాదేవ్ సింగ్, ఎస్పీ వివేకానంద శర్మ

పర్లాకిమిడి/రాయగడ: జిల్లా కేంద్రంలోని కలెక్టర్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్‌లో ప్రజల నుంచి వివిధ వినతులు అందాయి. గజపతి, రాయగడ జిల్లాల కలెక్టర్లు లింగరాజ్ పండా, స్వాధాదేవ్ సింగ్ హాజరై, ప్రజల నుంచి వినతులు స్వీకరించి, పరిష్కారానికి ఉన్నతాధికారులకు ఆదేశాలు జారీ చేశారు. కార్యక్రమాల్లో ఎస్పీ వివేకానంద శర్మ, ఏడీఎంలు, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

సేవలు పునఃప్రారంభం

- బహనాగా బజార్ స్టేషన్ నుంచి రైలు సేవలు పునరుద్ధరణ
- వైజాగ్ పోర్టు నుంచి రౌర్కెలాకు ప్రయాణించిన తొలి గూడ్స్‌రైలు
- ఘటనా స్థలంలో రైల్వే భద్రతా కమిషనర్ విచారణ
- కోరమండల్ ఎక్స్‌ప్రెస్ లోకోపైలట్ల నుంచి వాంగ్మూలం నమోదు



మీడియాతో మాట్లాడుతున్న రైల్వే భద్రత కమిషనర్ శైలేష్‌కుమార్ పాఠక్



బహనాగా బజార్ వద్ద పరుగులు తీస్తున్న వందేభారత్ ఎక్స్‌ప్రెస్



ప్రారంభమైన పూరీ-హౌరా రైలు

భువనేశ్వర్:

బాలాసోర్ జిల్లా బహనాగా బజార్ స్టేషన్ కోరమండల్ ఎక్స్‌ప్రెస్ దుర్ఘటన మార్గంలో ప్రభావితమైన రైలు రవాణా సేవలు పునః ప్రారంభించారు. ఈ ప్రక్రియలో అనుబంధ యంత్రాంగాలు అవిశ్రాంతంగా కృషి చేసి స్వల్ప వ్యవధిలో సహాయక, పునరుద్ధరణ చర్యలు పూర్తి చేయడం సర్వత్రా అభినందనలు అందుకుంటున్నాయి. ఈ ప్రమాదం పట్ల నిష్పక్షపాత విచారణకు రైల్వేశాఖ నిర్ణయించింది. మరోవైపు నిబంధనల మేరకు ఆగ్నేయ సర్కిల్ రైల్వే భద్రత కమిషనర్(సీఆర్ఎస్) బహనాగా ప్రమాద ప్రాంతాన్ని సోమవారం సందర్శించారు. మూడు రోజుల తర్వాత రైల్వే భద్రత కమిషనర్ శైలేష్‌కుమార్ పాఠక్ కారణాన్ని తెలుసుకోవడానికి స్వతంత్ర దర్యాప్తులో భాగంగా పరిశీలించారు. రైల్వే స్టేషన్ సిగ్నల్, కంట్రోల్ రూమ్‌ను సందర్శించి, అక్కడి ఉన్నతాధికారులతో మాట్లాడారు. స్వతంత్ర విచారణ నివేదిక ఆధారంగా చట్టబద్ధమైన దర్యాప్తు ఫలితాలు అందుబాటులోకి వస్తాయని ఈ సందర్భంగా ఆయన తెలిపారు. అలాగే ఘటనపై రైల్వేశాఖ సీబీఐ విచారణ కోరిన నేపథ్యంలో స్పష్టమైన మార్గదర్శకాలు రావాల్సి ఉంది.

ఉచిత బస్సు ప్రయాణం..

బహనాగా రైలు ప్రమాదం కారణంగా రైలు సేవలకు అంతరాయం ఏర్పడిన దృష్ట్యా కోల్‌కతాకు వెళ్లాలనుకునే ప్రజలకు ఒడిశా ఉచిత బస్సు సేవలను అందిస్తోంది. పూరీ నుంచి 20 బస్సులు, భువనేశ్వర్ నుంచి 23, కటక్ నుంచి 16 బస్సులు ఆదివారం రాత్రి 11.30 గంటలకు కోల్‌కతాకు బయలుదేరాయి. భువనేశ్వర్ మున్సిపల్ కార్పొరేషన్(బీఎంసీ) ఆరోగ్యశాఖ మృతదేహంతో బంధువులను రవాణా చేయడానికి ఏర్పాట్లు చేసింది. ఈ సన్నాహాల కోసం 58 అంబులెన్స్, డీబీసీ వాహనాలను మొహరించారు. అలాగే బహనాగా రైలు దుర్ఘటన ప్రభావంతో పూరీ, భువనేశ్వర్, కటక్ నుంచి కోల్‌కతాకు ప్రయాణించే ప్రజలకు అత్యవసర సహాయాన్ని అందించేందుకు ఒడిశా స్టేట్ రోడ్ ట్రాన్స్‌పోర్ట్ కార్పొరేషన్(ఓఎస్ఆర్‌టీసీ) కొన్ని మార్గాల్లో బస్సు సేవలను రద్దు చేసింది.

రైల్వేమంత్రి ఉత్సాహం..

ప్రమాదంతో బహనాగా బజార్ స్టేషన్‌లో చెల్లాచెదురుగా పడి ఉన్న రైలు కోచ్‌లను పూర్తిగా తొలగించి, పట్టాలను పునర్నిర్మించారు. రైళ్ల రవాణాకు పటిష్టత నిర్ధారించిన మేరకు రాకపోకలకు అనుమతించారు. రైల్వేశాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ ఈ పనులను ప్రత్యక్షంగా పర్యవేక్షించడం విశేషం. రైలు ప్రమాదం జరిగిన 51గంటల అనంతరం ప్రభావిత మార్గంలో సేవలు తిరిగి ప్రారంభమయ్యాయి. ఘోరమైన దుర్ఘటనతో తీవ్ర మనస్తాపానికి గురైన మంత్రి.. అమాంతంగా రంగంలోకి దిగారు. పట్టాల పునర్నిర్మాణం, పటిష్టతతో తొలుత నడిచిన గూడ్స్ రైలు సిబ్బందికి చేయి ఊపుతూ, సురక్షితమైన ప్రయాణం కోసం ఘటనా స్థలంలో ప్రార్థించారు. వైజాగ్ ఓడరేవు నుంచి రూర్కెలా స్టీల్‌ప్లాంట్‌కు బొగ్గుతో కూడిన గూడ్స్‌రైలు ఆదివారం రాత్రి 10.40 గంటలకు తొలుత పట్టాలెక్కి పరుగులు తీసింది.

వందేభారత్ పరుగులు..

గూడ్సు రైలు రవాణాతో పునరుద్ధరణ పటిష్టత ఖరారు కావడంతో ప్రయాణికుల రైళ్ల రవాణాకు అనుమతించారు. ఈ నేపథ్యంలో ప్రయాణికులతో కూడిన పూరీ ఎక్స్‌ప్రెస్(12837)ను తొలుత నడిపించారు. పునరుద్ధరించిన ట్రాక్‌లపై సోమవారం ఉదయం 9.30 గంటలకు హౌరా-పూరీ వందేభారత్ ఎక్స్‌ప్రెస్ బహనాగా బజార్ స్టేషన్‌ను సురక్షితంగా దాటింది. ఘటనా స్థలంలో మొదటి సెమీ హైస్పీడ్ రైలు ప్రయాణిస్తున్నప్పుడు రైల్వేమంత్రి అశ్విని వైష్ణవ్ ప్రత్యక్షంగా హాజరై, చేతులుపుతూ లోకోపైలట్లను ఉత్సాహ పరిచారని అధికారులు తెలిపారు. అలాగే ఈ మార్గంలో రాజధాని ఎక్స్‌ప్రెస్ రైలు రవాణా పునరుద్ధరించారు. 28 రైళ్లు ఇప్పటికే అప్ అండ్ డౌన్ లైన్లను దాటాయి. నియంత్రిత వేగంతో ఈ మార్గంలో ప్రయాణికుల రైళ్లను నడిపిస్తున్నట్లు రైల్వేవర్గాలు పేర్కొన్నాయి. మరోవైపు సోమవారం 2 ప్రయాణికుల రైలుసేవలను రద్దు చేసినట్లు ప్రకటించారు. వీటిలో పూరీ-పాట్నా(18449) బైద్యనాథం ఎక్స్‌ప్రెస్, ఖుర్దారోడ్-ఖరగ్‌పూర్(18022) ఎక్స్‌ప్రెస్ రైళ్లు ఉన్నాయి.

ప్రత్యేక కంటైనర్లతో సన్నాహాలు..



తమ వారి ఆచూకీ కోసం అధికారులను సంప్రదిస్తున్న బాధిత కుటుంబీకులు

ఆచూకీ తెలియని మృతదేహాల తరలింపు అగమ్య గోచరంగా పరిణమిస్తోంది. ఈ విపత్కర పరిస్థితులను సమర్థంగా ఎదుర్కొనేందుకు యంత్రాంగం ఆచితూచి అడుగులు వేస్తోంది. శక్తివంతమైన సాంకేతిక కంటైనర్లను అందుబాటులోకి తెచ్చేందుకు యోచిస్తోంది. ఈ మేరకు పారాదీప్ పోర్టు వర్గాలతో సంప్రదింపులు జరుగుతున్నాయి. స్థానిక ఎయిమ్స్ వంటి ప్రముఖ ఆరోగ్యసేవా కేంద్రాల్లో కూడ మృతదేహాలు దీర్ఘకాలం తాజాగా ఉంచే సౌకర్యాలు అందుబాటులో లేనందున ఈ పరిస్థితి తలెత్తింది. పారాదీప్ నుంచి 5శక్తివంతమైన కంటైనర్లను తీసుకువచ్చి, స్థానిక ఎయిమ్స్ ప్రాంగణంలో తాత్కాలికంగా అందుబాటులో ఉంచేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఒక్కో కంటైనర్‌లో 40 నుంచి 50 వరకు మృతదేహాలను భద్ర పరిచేందుకు వీలఅవుతుంది. వీటిలో 2నెలల వరకు మృతదేహాలు తాజాగా ఉంటాయని భావిస్తున్నారు. 2 దశాబ్దాల విపత్తు నిర్వహణ అనుభవంతో రాష్ట్రప్రభుత్వం మరో మైలురాయిని ఆవిష్కరించే దిశలో అడుగులు వేయడం ప్రధానంగా చెప్పవచ్చు. రాత్రికి రాత్రి స్థానికులు గాడాంధకార చీకటిలో సెల్‌ఫోన్ల కాంతిలో బాధితులను హుటాహుటిన రక్షించేందుకు ప్రత్యక్షంగా రంగంలోకి దిగిన తొలి సహాయక బృందంగా నిలవడం దీనికి తార్కాణం. సత్వర చికిత్స కోసం రక్తదానం చేసేందుకు స్వచ్ఛందంగా యువత ముందుకు రావడం మానవీయతకు అద్దం పట్టింది. వీరి సత్వర సహాయక చర్యలే సమారు 1,200మంది గాయపడిన ప్రయాణికుల ప్రాణాలను రక్షించగలదని పరిశ్రమల శాఖ కార్యదర్శి హేమంత్ శర్మ ప్రశంసించారు.



దెబ్బతిన్న కోరమండల్ ఇంజిన్ భాగాన్ని వ్యాగన్‌లో తరలిస్తున్న దృశ్యం

గుర్తింపే పెను సవాల్..!



మాట్లాడుతున్న సీఎస్ ప్రదీప్‌కుమార్ జెనా

కోరమండల్ ఎక్స్‌ప్రెస్ దుర్ఘటన తదనంతర కార్యాచరణ పెను సవాల్‌గా మారింది. పునరుద్ధరణ, పునర్నిర్మాణ పనులు 1, 2 రోజుల్లో పూర్తిస్థాయిలో పూర్తికావడం ఖాయం. అయితే సహాయక చర్యలు పూర్తయినట్లు రైల్వేవర్గాలు చేస్తున్న ప్రకటనలు వాస్తవ దూరంగా ఉన్నాయి. బాధితులు, మృతుల సంఖ్య ఖరారు చేయడంలో అటు రైల్వే, ఇటు రాష్ట్రప్రభుత్వం అనుక్షణం మార్పుచేర్పులు చేస్తునే ఉంది. గుట్టలుగా పడి ఉన్న మృతదేహాల్లో సజీవంగా ఉన్న బాధిత యువకుడిని అతని తండ్రి గుర్తించాడనే వార్త దీనికి తార్కాణంగా చెప్పవచ్చు. మరోవైపు మృతులను గుర్తించడంలో బంధువర్గాలు తల్లడిల్లుతున్నారు. ఒకే మృతదేహానికి ఇద్దరు, ముగ్గురు బంధువులు తమదిగా పేర్కొంటూ ముందుకు వస్తున్న విచారకర పరిస్థితులు తలెత్తుతున్నట్లు సమాచారం. ఇటువంటి సందిగ్ధత తలెత్తిన పరిస్థితుల్లో ఆచూకీ లభించని మృతదేహాలుగా పరిగణించి యంత్రాంగం ఊగిసలాడిస్తోంది. మృతదేహాలను అయిన వారికి అప్పగించడంలో అత్యంత జాగరూకత ప్రదర్శిస్తున్నట్లు అధికార వర్గాలు చెబుతున్నాయి. ఇటువంటి పరిస్థితుల్లో డీఎన్‌ఏ పరీక్షలు నిర్వహించడం అనివార్యమయ్యే అవకాశం ఉంటుందని భువనేశ్వర్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ విజయ్‌అమృత కులంగా తెలిపారు. ఇప్పటి వరకు 170 మృతదేహాలను గుర్తించగా, దాదాపు 50కి పైగా ఆచూకీ తేలనవిగా ఉన్నాయని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ప్రదీప్‌కుమార్ జెనా స్పష్టం చేశారు. నిర్ణీత ప్రక్రియ అనంతరం గమ్యస్థానానికి రవాణా చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఖర్చులతో పలు ప్రాంతాల్లో గమ్యస్థానం వరకు బంధువర్గాలతో మృతదేహాలను వాహనాలు ఇతరేతర అనుకూల రవాణా మాధ్యమాల్లో ఉచితంగా తరలించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు పేర్కొన్నారు. మృతదేహాలను వివిధ రాష్ట్రాలకు తరలించేందుకు ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేస్తోంది. మరణ ధ్రువీకరణ పత్రాలు త్వరలో కుటుంబాలకు ఎలక్ట్రానిక్ లేదా పోస్ట్ ద్వారా పంపించనున్నట్లు వివరించారు.




మృతుల గుర్తింపు, వివరాలు అందజేయడంలో నిమగ్నమైన భువనేశ్వర్ కమిషనరేట్ పోలీసులు

● లోకోపైలట్ల వాంగ్మూలం నమోదు..

దుర్ఘటన పాలైన కోరమండల్ ఎక్స్‌ప్రెస్ రైలు లోకోపైలట్లను 3 రోజుల తర్వాత తెరపైకి తెచ్చారు. వీరి ఆచూకీ పట్ల సర్వత్రా ఆందోళన వ్యక్తం అవుతోంది. పలు వర్గాలు లోకోపైలట్ మహంతి చికిత్స పొందుతూ ప్రాణాలు కోల్పోయినట్లు ప్రచారం చేసి, దుమారం రేపారు. వాస్తవానికి కోరమండల్ రైలు లోకోపైలట్ జీఎన్ మహంతి, సహాయ లోకోపైలట్ హజారీ బెహరా గాయాలతో అమ్రి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. దుర్ఘటన ముందంజ బాధితులుగా నిలిచిన వీరితో సంప్రదింపులకు రైల్వేశాఖ నివారించడంతో వదంతులు ఊపందుకున్నాయి. సీఆర్ఎస్, సీబీఐ వంటి ఉన్నత స్థాయి విచారణ వ్యవహారం ప్రారంభం కావడంతో ఇరువురి ఆచూకీ క్రమంగా బయటపడుతోంది. దుర్ఘటనకు సంబంధించి విచారణ వర్గాలు సోమవారం లోకోపైలట్, అసిస్టెంట్ లోకోపైలట్ వాంగ్మూలం నమోదు చేసినట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం. ఘోరమైన బాలాసోర్ రైలు దుర్ఘటన ప్రత్యక్ష ప్రమాదకర దృశ్యాలను కళ్లారా చూసిన వారిగా ప్రాథమిక వాంగ్మూలం.. విచారణలో అత్యంత కీలకం. ఈ నేపథ్యంలో విచారణ వర్గాలు దర్యాప్తుకు శ్రీకారం చుట్టినట్లు స్పష్టం అవుతోంది.

● గుర్తింపునకు ఏర్పాట్లు..



ఎయిమ్స్ ఆవరణలో మృతుల వివరాలతో ఏర్పాటైన భారీ టెలివిజన్

రైలు ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన వ్యక్తులను కుటుంబీకులు సులభంగా గుర్తించేందుకు పలు ఏర్పాట్లు చేశారు. ఏ కుటుంబానికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఉండేలా కృషి చేస్తున్నారు. ప్రతి ఆస్పత్రి, భువనేశ్వర్ మున్సిపల్ కార్పొరేషన్ సెంట్రల్ కంట్రోల్ రూమ్‌లో హెల్ప్‌డెస్క్ పనిచేస్తోందని అధికారులు తెలిపారు. స్థానిక ఎయిమ్స్ ఆవరణలో బాలాసోర్ బహనాగా బజార్ రైలు దుర్ఘటనలో మరణించిన ప్రయాణికులను గుర్తించేందుకు కుటుంబాలకు సౌకర్యంగా ఉండేలా పెద్ద స్క్రీన్ టీవీలు ఏర్పాటు చేశారు.

●అయిన వారికి దూరంగా..



దుర్ఘటనతో చికిత్స కోసం ఆస్పత్రి పాలైన పలువురు బాధితులు అయిన వారికి దూరంగా వ్యక్తీకరించుకోలేని మానసిక వేదనతో కొట్టుమిట్టాడుతున్నారు. కటక్ ఎస్‌సీబీ వైద్య బోధన ఆస్పత్రి పాత ఆర్థోపెడిక్ వార్డ్ బెడ్‌నంబర్ టీ-2 పడక మీద ఇబ్రహీం షేక్ అనే వ్యక్తి ఇదే పరిస్థితిలో కొనసాగుతున్నాడు. ఆయన కుటుంబీకులకు ఈ సమాచారం అందజేయాలని స్థానిక స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు అభ్యర్థిస్తున్నారు. ఈ ఫొటోలో వ్యక్తిని గుర్తించే వారు వివరాల కోసం 9348220569 నంబర్‌కు ఫోన్ చేయాలని కోరుతున్నారు. ఎస్‌సీబీ ఐసీయూలో చికిత్స పొందుతున్న మరో బాధితుడి పరిస్థితి ఇలాగే ఉంది. అతని ప్రాథమిక ఆచూకీ తెలియలేదు. ఎవరైనా ముఖాన్ని గుర్తించినట్లయితే హెల్ప్‌లైన్ నంబర్ 18003450061 లేదా 1929ని తక్షణమే సంప్రదించాలని సూచించారు.



ఆస్పత్రుల్లో బాధితులకు మానసిక స్థైర్యం ప్రేరేపిస్తున్న కౌన్సెలర్లు

క్లుప్తంగా

హోంగార్డు కుటుంబానికి ఆర్థిక సాయం

శ్రీకాకుళం క్రైమ్: జిల్లా పోలీసు శాఖలో హోంగార్డుగా పనిచేస్తూ ఇటీవల మరణించిన వి.ప్రకాశరావు కుటుంబానికి సహోద్యోగులు అండగా నిలిచారు. ఒకరోజు వేతనాన్ని విరాళంగా ఇచ్చారు. ఇలా సమకూరిన రూ. 4.23 లక్షల చెక్కును జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం జరిగిన కార్యక్రమంలో మృతుడి కుటుంబ సభ్యులకు జిల్లా ఎస్పీ జి.ఆర్.రాధిక అందజేశారు. ప్రకాశరావు కుటుంబానికి పోలీసు శాఖ అండగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ (పరిపాలన) జె.తిప్పేస్వామి, పరిపాలనాధికారి సీహెచ్ గోపినాథ్, ఆర్ఐ ప్రదీప్ ఉన్నారు.

అసిస్టెంట్ ప్రొఫెసర్‌కు అభినందన

ఎచ్చెర్ల క్యాంపస్: శ్రీకాకుళం రాజీవ్ గాంధీ వైజ్ఞానిక విశ్వవిద్యాలయంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న కొడవలి అరుణ కుమారి ఆంధ్రా విశ్వవిద్యాలయంలో కెమిస్ట్రీలో డాక్టరేట్ పూర్తి చేశారు. ఈమెను శ్రీకాకుళం క్యాంపస్ డైరెక్టర్ ప్రొఫెసర్ పెద్దాడ జగదీశ్వరరావు ప్రత్యేకంగా సోమవారం అభినందించారు. బోధనసిబ్బంది పరిశోధలనకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు.

జీడికి మద్దతు ధర ప్రకటించాలి



ర్యాలీలో పాల్గొన్న జీడి రైతులు

కాశీబుగ్గ: జీడి పంటకు మద్దతు ధర ప్రకటించాలని రైతు సంఘం నాయకులు కోరారు. ఇదే డిమాండ్‌తో పలాస ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి కాశీబుగ్గ బస్టాండ్ మూడు రోడ్ల జంక్షన్ వరకు జీడి రైతుల సంఘం ఆధ్వర్యంలో సోమవారం రైతులు ర్యాలీ నిర్వహించారు. అనంతరం మూడు రోడ్ల కూడలి వద్ద మానవహారం చేపట్టారు. ఈ సందర్భంగా సంఘ నాయకులు మాట్లాడుతూ.. ప్రభుత్వాలు రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేస్తామని హామీ ఇవ్వడమే తప్ప ఆచరణకు నోచుకోలేదన్నారు. గతంలో 80 కిలోల జీడి పిక్కల బస్తా రూ.14 వేలు పలికేదని, ప్రస్తుతం రూ. ఎనిమిది వేలకు పడిపోవడం బాధాకరమన్నారు. పలాస జీడి వ్యాపారులు సిండికేట్‌గా మారి రాష్ట్రంలో జీడి వ్యాపారాన్ని శాసిస్తున్నారని ఆరోపించారు. పిక్కల ధర రోజురోజుకు తగ్గుతుంటే పప్పు ధర పెరగడం శోచనీయమన్నారు. రైతులకు న్యాయం చేయాలని కోరారు. అనంతరం బస్తాకు రూ.16 వేలు మద్దతు ధర కల్పించాలని కోరుతూ పలాస ఆర్డీవో సీతారామమూర్తికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో జీడి రైతుల సంఘం జిల్లా కన్వీనర్ తెప్పల అజయ్ కుమార్, ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

అమ్మవారికి ఊయలాట..

- కొనసాగుతున్న బురదల పోలమ్మ ఉత్సవాలు



అలరిస్తున్న కేరళకు చెందిన వాయిద్య బృందం

రాయగడ: గత ఎనిమిది రోజులుగా కొనసాగుతున్న గ్రామదేవత బురదల పోలమ్మ అమ్మవారి ఉత్సవాల్లో భాగంగా ఊయలాట ఆదివారం రాత్రి సాంప్రదాయంగా నిర్వహించారు. పతివాడ వంశస్తులు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తూ వస్తున్నారు. ఈసారి కూడా ఉత్సవ కమిటీ మాజీ అధ్యక్షుడు పతివాడ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో సంబరం ఘనంగా చేపట్టారు. రజకులు తీసుకువచ్చిన కర్రలతో ప్రత్యేకంగా ఊయలలను తయారు చేశారు. దీనికి అయ్యే ఖర్చు మొత్తం పతివాడ వంశస్తులు చెల్లించారు. ముందుగా రాటలను పాతిన సమయంలో పూజలు నిర్వహించి, కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఉత్సవ వేదిక వద్ద కొలువైన అమ్మవారి ప్రతిరూపాలైన ఘటాలను ఆదివాసీ వాయిద్యాల నడుమ ఊయల వద్దకు తీసుకువచ్చారు. ఈ క్రమంలో పూజారి, పూజారమ్మలు ఊయలలూగరు. అనంతరం ఘటాలను ట్రెజరీ కార్యాలయం నుంచి మెయిన్ రోడ్డు వరకు తీసుకువచ్చి, వేదిక వద్ద నిలిపారు. దీనిపై స్థానికంగా ఓ కథ ప్రచారంలో ఉంది. గ్రామ ప్రజలు ఆపదలో ఉండటాన్ని గమనించిన బురదల పోలమ్మ.. మశూచి మహమ్మారిని ఊరి పొలిమేర నుంచి తరిమివేస్తుంది. దీంతో ఉగ్రరూపంతో వచ్చిన అమ్మవారికి గ్రామస్తులు పాలు, నీలధారతో శాంతింపజేస్తారు. అనంతరం అమ్మవారికి సంబరాలు చేపట్టి, ఊయలాట ఆడించి ఆనందడోలికల్లో ముంచుతారు. దీనినే ఊయలాటగా పిలుస్తుంటారు. ఈ సంబరాల్లో ఇదే ప్రధాన ఘట్టంగా అభివర్ణిస్తారు.

అలరించిన వాయిద్యాలు..

అమ్మవారి ఉత్సవాల్లో భాగంగా నిర్వాహకులు ఆదివారం రాత్రి కేరళకు చెందిన ప్రత్యేక వాయిద్య బృందంతో సాంస్కృతిక కార్యక్రమం నిర్వహించారు. సంప్రదాయ దుస్తులతో వాయిద్యకారులు నిర్వహించిన సందడి అందరినీ ఆకట్టుకుంది. ఈ సాంస్కృతిక కార్యక్రమాన్ని రాజ్యసభ మాజీ ఎంపీ నెక్కంటి భాస్కరరావు ఏర్పాటు చేశారు. మరోవైపు ఉత్సవాలు బుధవారంతో ముగుస్తాయని నిర్వాహకులు తెలిపారు.



ఊయలాట మండపం వద్ద పూజలు చేస్తున్న భక్తులు

కాసీపూర్‌లో కొవ్వొత్తుల ర్యాలీ



కొవ్వొత్తుల ర్యాలీలో పాల్గొన్న వ్యాపారులు

- సీఎం సహాయనిధికి రూ.25 వేల విరాళం



సీఎం సహాయనిధికి విరాళం అందిస్తున్న హెచ్‌ఎం రామచంద్ర

రాయగడ: బాలేశ్వర్ జిల్లా బహనాగా బజార్ రైల్వే స్టేషన్ వద్ద జరిగిన ఘోర రైలు ప్రమాదంలో మృతిచెందిన వారికి సంతాపంగా జిల్లాలోని కాసీపూర్ సమితి టికిరిలో ఆదివారం రాత్రి కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. టికిరి వ్యాపార సంస్థలకు చెందిన వారంతా జగన్నాథ మందిరం నుంచి గొకులముండ ప్రాంతం వరకు ర్యాలీ చేపట్టారు. అలాగే.. బహనాగా రైలు దుర్ఘటనలో బాధిత కుటుంబాలను ఆదుకునేందుకు తనవంతు సహాయంగా జిల్లాలోని సదరు సమితి పరిధిలోని తడమ ఉన్నత పాఠశాలకు చెందిన ప్రధానోపాధ్యాయుడు రామచంద్ర సేనాపతి రూ.25 వేల విరాళాన్ని సీఎం సహాయనిధికి అందించారు. దీనికి సంబంధించిన చెక్కును సోమవారం జిల్లా అదనపు మేజిస్ట్రేట్ ధర్మానంద బెహరాకు అందించి, మానవత్వాన్ని చాటుకున్నారు. ఈ సందర్భంగా తోటి ఉపాధ్యాయులు ఆయనను అభినందించారు.

డాక్టర్ రెడ్డీస్‌కు పర్యావరణ అవార్డు

రణస్థలం: ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా పైడిభీమవరం పారిశ్రామికవాడలోని డాక్టర్ రెడ్డీస్ ల్యాబొరేటరీస్ లిమిటెడ్ (సీటీవో-6)కు ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి ప్రతిష్టాత్మకమైన పర్యావరణ ఎక్సలెన్స్ 2023 అవార్డు ప్రకటించిది. ఈ అవార్డును విజయవాడలోని ఏపీ ఇంధన, పర్యావరణ, అటవీ, శాస్త్రసాంకేతిక, గనులు, భూగర్భ శాఖల మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి చేతుల మీదుగా డాక్టర్ రెడ్డీస్ ప్రతినిధులు సీటీవో-6 సైట్ హెడ్ ధర్మేష్ పంచాల్, కార్పొరేట్ వ్యవహారాల లీడ్ కేవీఎస్ఎన్ రాజ్, సేఫ్టీ హెల్త్ అండ్ ఎన్విరాన్మెంట్ లీడ్ ఎస్. శ్రీధర్‌లు అందుకున్నారు. మురుగునీటి నిర్వహణ, ఇంధన పరిరక్షణ, ఇతర అత్యుత్తమ పర్యావరణ పద్ధతులతో సహా డాక్టర్ రెడ్డీస్ అనుసరిస్తున్న వివిధ సుస్థిరత పద్ధతులను పర్యావరణ అధికారులు ఇటీవల పరిశ్రమకు వచ్చి అధ్యాయనం చేశారని రెడ్డీస్ ప్రతినిధులు తెలిపారు. జీరో లిక్విడ్ డిశ్చార్జ్ అనే ప్రత్యేక విధానాన్ని కూడా అధికారులు పరిశీలించడం జరిగిందని చెప్పారు. ఈ అంశాలన్నీ క్రోడీకరించి పర్యావరణ అవార్డును ప్రభుత్వం ప్రకటించడం పట్ల పరిశ్రమ యాజమాన్యం ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలియజేసింది.

నేటి నుంచి ఏపీ పీజీ సెట్

ఎచ్చెర్ల క్యాంపస్: రాష్ట్రంలోని విశ్వవిద్యాలయాల్లో పోస్టు గ్రాడ్యుయేషన్ కోర్సుల్లో ప్రవేశానికి సంబంధించిన ఏపీ పీజీసెట్-2023 మంగళవారం నుంచి మొదలుకానుంది. ఆన్‌లైన్ పద్ధతిలో ఈ పరీక్షలు నిర్వహించనున్నారు. చిలకపాలెంలోని శ్రీ శివానీ ఇంజినీరింగ్ కాలేజ్, ఎచ్చెర్లలోని శ్రీ వెంకటేశ్వర ఇంజినీరింగ్ కాలేజ్ ఆన్‌లైన్ పరీక్ష కేంద్రాల్లో మూడు షిఫ్టుల్లో పరీక్షలు నిర్వహించనున్నారు. 10వ తేదీ వరకు పరీక్షలు జరుగుతాయి. విద్యార్థులు నోటిఫికేషన్ నిబంధన, పరీక్షల షెడ్యూల్ మేరకు హాజరుకావాల్సి ఉంటుంది. 6వ తేదీన ఇంగ్లిష్, బోటనీ, మ్యాథమేటికల్ సైన్సెస్, హ్యూమానిటీస్ అండ్ సోషల్ సైన్సెస్, 7వ తేదీన తెలుగు, లైఫ్ సైన్సెస్, కామర్స్, ఎలక్ట్రానిక్స్, 8వ తేదీన కెమికల్ సైన్సెస్, హిస్టరీ, ఫిజికల్ ఎడ్యుకేషన్, ఎకనామిక్స్, స్టాటిస్టిక్స్, ఎడ్యుకేషన్, 9వ తేదీన జువాలజీ, కంప్యూటర్ సైన్స్, ఫుడ్ అండ్ న్యూట్రిషనల్ సైన్సెస్, సెరికల్చర్, జియోలజీ, 10న ఫిజికల్ సైన్సెస్, సైకాలజీ పరీక్షలు నిర్వహించనున్నారు. రాష్ట్రంలో 17 విశ్వవిద్యాలయాల్లో పీజీ సెట్ ర్యాంకు ఆధారంగా ప్రవేశాలు కల్పిస్తారు. జిల్లా విద్యార్థులు కొందరికి విజయనగరం జిల్లా జీఎంఆర్ కళాశాల పరీక్ష కేంద్రం సైతం కేటాయించారు. కన్వీనర్‌గా ఏయూ ప్రొఫెసర్ సీహెచ్‌వీవీఎస్ భాస్కర రెడ్డి వ్యవహరిస్తున్నారు. విద్యార్థులు సమాచారం కోసం ఫోన్ నంబర్ 0891 2719544 ను సంప్రదించవచ్చు.

వైభవంగా మా భగవతి ఆలయ ప్రతిష్టోత్సవాలు



పూజలు నిర్వహిస్తున్న వేద పండితులు



ప్రతిష్టకు సిద్ధం చేసిన విగ్రహాలు

జయపురం: జయపురం మహారాజుల ఆరాధ్యదైవం, పట్టణంలోని మూడు దేవీ పీఠాలలో ఒకటైన మా భగవతి పీఠంలో పార్శ్వ విగ్రహాలు, దేవీ నూతన ఆలయ ప్రతిష్టోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో స్థానిక నారాయణ మందిరం వీధిలోని వల్లభ నారాయణ మందిర ప్రాంగణంలో నిర్మించిన మందిరాన్ని తిలకించేందుకు పెద్ద సంఖ్యలో భక్తులు పోటెత్తారు. 5రోజులు జగరనున్న ప్రతిష్టోత్సవాల్లో భాగంగా.. సోమవారం కలసయాత్ర, మండపారాధన, అగ్నిస్థాపన తదితర కార్యక్రమాలు నిర్వహించారు. గురువారంతో ఉత్సవాలు ముగుస్తాయని ఆలయ కమిటీ ప్రతినిధులు తెలిపారు. గంజాం జిల్లా చికిటి లోకనాథ్‌పూర్‌కు చెందని వేద పండితులు అశోక్‌కుమార్ పాఢి పర్యవేక్షనలో పూజలు చేపడుతున్నారు.

కిరాణా దుకాణంలో చోరీ



డైలీ మార్కెట్‌లో మూసి ఉన్న దుకాణాలు

- పోలీసుల నిర్లక్ష్యానికి నిరసనగా దుకాణాలు మూసి వేసిన వర్తకులు




చోరీకి గురైన దుకాణం

రాయగడ: పట్టణంలోని డైలీ మార్కెట్‌లో ఓ కిరాణా దుకాణంలో ఆదివారం రాత్రి చోరీ జరిగింది. ఈ మేరకు దుకాణం యజమాని ఇప్పిలి కామేశ్వరరావు సోమవారం ఉదయం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఘటనా స్థలాన్ని పరిశీలించిన సిబ్బంది.. డాగ్ స్క్వాడ్‌ను రంగంలోకి దింపారు. వివరాలు పరిశీలిస్తూ.. సోమవారం ఉదయం ఎప్పటిలాగే దుకాణం తెరిచేందుకు కామేశ్వరరావు వెళ్లగా.. అప్పటికే షర్టర్ విరిగి ఉన్నట్లు గమనించాడు. కొద్ది దూరంలో గల్లా పెట్టె పడి ఉండటాన్ని గుర్తించి, తోటి వ్యాపారుకు సమాచారం అందించారు. అంతా కలిసి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దుకాణం షర్టర్‌కు ఉన్న గోడను విరగ్గొట్టిన దుండగులు.. లోపలికి చొరబడి గల్లా పెట్టెలోని రూ.70 వేల నగదు, రూ.2 వేల విలువైన సామగ్రి ఎత్తుకు పోయినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. మరోవైపు గత 3నెలల్లో డైలీ మార్కెట్‌లో 4దొంగతనాలు జరిగినప్పటికీ పోలీసులు ఇప్పటి వరకు ఎవరినీ పట్టుకోలేదు. దీంతో పాటు పెరుగుతున్న చోరీలను అరికట్టాలని నిరసిస్తూ వర్తక సంఘం ప్రతినిధులంతా సోమవారం ఉదయం దుకాణాలను మూసివేసి, నిరసన వ్యక్తం చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

అలరనాథ్ దర్శనానికి పోటెత్తిన భక్తులు



భక్తజనంతో కిటకిటలాడుతున్న దేవస్థానం



అలార్‌నాథ స్వామి

భువనేశ్వర్: పూరీ నుంచి సుమారు 20 కిలోమీటర్ల దూరంలోని బ్రహ్మగిరి ప్రాంతంలో నెలకొన్న అలార్‌నాథ్ దేవస్థానానికి భక్తజనం పోటెత్తుతున్నారు. ఆదివారం దేవస్నాన పూర్ణిమ పురస్కరించుకుని భారీగా స్నానమాచరించిన జగన్నాథుడు స్వల్ప అస్వస్థతకు గురై, తెరుమరుగు కావడంతో ఈ దేవస్థానం భక్తజనంతో కళకళలాడుతోంది. ఏటా స్నానోత్సవం తర్వాత నేత్రోత్సవం వరకు సుమారు పక్షం రోజుల పాట్లు భక్తులు అలార్‌నాథునే దర్శించుకుంటారు. సోమవారం నుంచి ఈ రద్దీ ప్రారంభమైంది. శ్రీమందిరం ప్రధాన ఆలయంలో సోదర సోదరీ, ఆయుధ సమేతంగా జగన్నాథుని మూలవిరాట్‌లు భక్తులకు దర్శనం లభించని పక్షం రోజుల్లో అలార్‌నాథుని దర్శించుకుంటే దేవదేవుని దర్శించిన ఫలంతో పాటు మోక్షం ప్రాప్తిస్తుందని భక్తుల విశ్వాసం. ఈ దేవస్థానంలో ఖీరి అధిష్టాన దేవుడి ప్రియమైన నైవేద్యం. అత్యంత రుచికరంగా ఉండే దీనిని భక్తులు మక్కువతో స్వీకరించడం విశేషం. ఈ ఆలయాన్ని 12వ శతాబ్దంలో రాజస్థాన్‌కు చెందిన అల్వార్ పాలకులు నిర్మించినట్లు పౌరాణిక గాథ ప్రచారంలో ఉంది. వారి వంశానికి ప్రతీకగా ఈ దేవస్థానం అలార్‌నాథ్ దేవస్థానంగా పేరొందినట్లు చెబుతారు. ఇక్కడ దర్శనమిచ్చే దైవం శ్రీ మహావిష్ణువు.



ముస్తాబైన అలార్‌నాథ్ దేవస్థానం సింహద్వారం

ప్రకృతే ప్రమాణం..



మహేంద్రగిరి పర్వతాలపై వ్యర్థాల తొలగింపులో ఎస్‌కేసీజీ కళాశాల ఎన్‌సీసీ క్యాడెట్లు



బరంపురం: కేకే కళాశాల ప్రాంగణంలో అవగాహన కల్పిస్తున్న దృశ్యం



బరంపురం: తంపరాలో స్వచ్ఛభారత్ నిర్వహిస్తున్న సుబుజవాని ప్రతినిధులు



జయపురం: సీవా సైకిల్ ర్యాలీని ప్రారంభిస్తున్న సిద్ధార్థ పట్నాయక్



జయపురం: మొక్కలు నాటుతున్న న్యాయవాదులు



రాయగడ: మహిళా కళాశాలలో మొక్కలు నాటుతున్న న్యాయమూర్తులు



రాయగడ: ఇంఫాలో కార్యక్రమానికి హాజరైన కార్మికులు



రాయగడ: మంత్రి అమాత్ నుంచి అవార్డు స్వీకరిస్తున్న ఖదంగ



పర్లాకిమిడి: ఆర్.సీతాపురంలో మొక్క నాటి, నీరు పోస్తున్న న్యాయమూర్తి రబినారాయణ బెహరా



బరంపురం: చైతన్య ర్యాలీ నిర్వహిస్తున్న ఆర్యబట్టా విద్యాసంస్థ ప్రతినిధులు

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని వక్తలు పేర్కొన్నారు. ప్రపంచ పర్యావరణ దినోవాన్ని రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో సోమవారం ఘనంగా నిర్వహించారు. దీనిలో భాగంగా అవగాహన ర్యాలీలు, సమావేశాలు నిర్వహించారు. ప్రతిఒక్కరూ మొక్కలు నాటడంతో పాటు సంరక్షించాలని పిలుపునిచ్చారు. ప్లాస్టిక్ వినియోగాన్ని అరికట్టాలని సూచించారు. పర్యావరణానికి హాని మానవ మనుగడకే ప్రమాదమని హెచ్చరించారు.

– సాక్షి నెట్‌వర్క్

74 యూనిట్ల రక్తం సేకరణ

- బాలేశ్వర్ క్షతగాత్రులకు అండగా రక్తదాన శిబిరాలు



రక్తదాతను అభినందిస్తున్న చిరంజీవి కల్చరల్ అసిసోయేషన్ సభ్యులు

జయపురం: బాలేశ్వర్ జిల్లాలో జరిగిన ఘోర రైలు ప్రమాదంలో గాయపడి, వివిధ ఆస్పత్రులలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులకు అవసరమైన రక్తాన్ని సమకూర్చేందుకు జయపురంలోని స్వచ్ఛంద సంస్థలు నడుం బిగించాయి. ఈ మేరకు జయపురం చిరంజీవి కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రభుత్వ బ్లడ్ బ్యాంక్ కార్యాలయంలో సోమవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. ఇందులో 40 యూనిట్ల రక్తాన్ని సేకరించినట్లు అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు వై.శ్రీనివాస ఖన్నా తెలిపారు. ప్రమాదం జరిగిన వెంటనే హైదరాబాద్ నుంచి అఖిల భారత చిరంజీవి యువత వ్యవస్థాపక అధ్యక్షుడు, శిబిరం ఇన్‌చార్జి స్వామినాయుడు రక్తదాన శిబిరాలు నిర్వహించాలని ఆదేశించారన్నారు. ఈ మేరకు భువనేశ్వర్, బరంపురం, కటక్ తదితర ప్రాంతాల్లో రక్తదాన శిబిరాలు నిర్వహించామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా రక్తదాతలను అభినందించారు. కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు ఎంఎం నాయక్, గోవింద నాయక్, కె.రాంబాబు, కె.గణేష్‌రెడ్డి, గుప్త, ఎస్.శ్రీను, టి.గోవింద, రమణస్వామి, గౌరీ తదితరులు పాల్గొన్నారు.

అనుతోష్ పాణీ మెమోరియల్ ట్రస్టు ఆధ్వర్యంలో..

జయపురం అనుతోష్ పాణీ మెమోరియల్ ట్రస్టు ఆధ్వర్యంలో 2 యూనిట్ల ఓ నెగిటివ్ గ్రూపు రక్తంతో పాటు 32 యూనిట్ల రక్తాన్ని సేకరించినట్లు నిర్వాహకులు వెల్లడించారు. బ్లడ్ బ్యాంక్ అధికారి డాక్టర్ సూర్యశేఖర మిశ్రా పర్యవేక్షణలో టెక్నీషియన్లు అమ్లాన్‌జ్యోతి దాస్, నివేదిత మహారాణా, ప్రతిభ పాత్రొ, లతా దేయి, అభయచరణ్ పండా, శశిభూషణ పాత్రొ, ప్రమోద్ ఖీలో పర్యవేక్షించారు. కార్యక్రమంలో బరిణిపుట్ అజాద్ యువసంఘం సభ్యులు, ట్రస్టు సభ్యులు, జిల్లా రక్తదాతల చైతన్య శిబిరం సహాయ కార్యదర్శి ప్రమోద్‌కుమార్ రౌళొ తదితరులు పాల్గొన్నారు.



అనుతోష్ పాణీ మెమోరియల్ ట్రస్టు ఆధ్వర్యంలో రక్తం సేకరణ

క్లుప్తంగా

రాజన్నదొరను పరామర్శించిన బడ్డుకొండ



ఉపముఖ్యమంత్రి పీడిక రాజన్నదొరతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు

సాలూరు: కాలిగాయంతో బాధపడుతున్న డిప్యూటీ సీఎం, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి పీడిక రాజన్నదొరను సాలూరులోని ఆయన స్వగృహంలో నెలిమర్ల ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు సోమవారం పరామర్శించారు. ప్రస్తుతం ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

16న కురుపాంలో జాబ్‌మేళా



జాబ్‌మేళా పోస్టర్లను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ నిషాంత్‌కుమార్

పార్వతీపురం: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఉపాధి కల్పనలో భాగంగా ఈ నెల 16న కురుపాంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్టు కలెక్టర్ నిషాంత్‌కుమార్ తెలిపారు. ఈ మేరకు కలెక్టర్ కార్యాలయంలో జాబ్‌మేళా పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ మేళాలో 10 కంపెనీల ప్రతినిధులు హాజరవుతారన్నారు. పదో తరగతి, ఇంటర్, ఐటీఐ, డిగ్రీ, పీజీ చదివిన విద్యార్థులు తమ వివరాలను డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.ఏపీఎస్ఎస్‌డీసీ.ఇన్ వెబ్‌సైట్‌లో నమోదుచేసుకోవాలని జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి సాయికుమార్ కోరారు. మరిన్ని వివరాలకు సెల్: 6303493720, 8978878557 నంబర్లను సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో స్కిల్ డెవలప్‌మెంట్ స్పెషల్ ఆఫీసర్ వినోద్‌కుమార్ పాల్గొన్నారు.

పోస్టల్ జన్‌ధన్ ఖాతాలు తెరచుకోండి

మక్కువ: ప్రధానమంత్రి జన్‌ధన్ యోజన ఖాతాదారులకు బహుళ ప్రయోజనాలు కలుగుతాయని బొబ్బిలి సబ్‌డివిజన్ పోస్టల్ ఇన్‌స్పెక్టర్ కె.చంద్రశేఖర్ తెలిపారు. మక్కువ మండలం కొయ్యానపేటలో సోమవారం కేంద్రప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రధానమంత్రి జన్‌ధన్ యోజన పథకంపై అవగాహన కల్పించారు. డిపాజిట్లు చేసిన ఖాతాదారులకు వడ్డీ వస్తుందన్నారు. జీరో బ్యాలెన్స్‌తో ఖాతా తెరచుకోవచ్చని తెలిపారు. ప్రమాదబీమా లక్ష రూపాయల వరకు వర్తిస్తుందన్నారు. మొబైల్ బ్యాంకింగ్ సౌకర్యం ఉందన్నారు. పోస్టల్ జన్‌ధన్‌యోజన పథకం 18 సంవత్సరాల వయస్సు నిండి 65 సంవత్సరాలలోపు ఖాతాదారులకు వర్తిస్తుందని తెలిపారు.

రిజర్వేషన్లతోనే ఆర్థిక ప్రగతి

గుమ్మలక్ష్మీపురం: రిజర్వేషన్లతోనే గిరిజన తెగల ఆర్థిక, విద్య, ఉద్యోగ ఉన్నతి సాధ్యమని మాజీ ఎంపీ, ఆదివాసీ అధికారమంచ్ చైర్మన్ మిడియం బాబూరావు అన్నారు. ఏపీ గిరిజన సంఘం ఆధ్వర్యంలో గుమ్మలక్ష్మీపురంలోని కళింగ వైశ్యకళ్యాణ మండపంలో గిరిజన రిజర్వేషన్లపై సోమవారం నిర్వహించిన జిల్లా సదస్సులో ఆయన మాట్లాడారు. గిరిజనుల అభివృద్ధి కోసం ఏర్పాటు చేసిన ఐటీడీఏలు, 1/70 చట్టం, అటవీ హక్కుల చట్టం, పీసా చట్టాలను పగడ్బందీగా అమలు చేయాల్సిన అవసరం ఉందన్నారు. గిరిజన కులాల్లో 8 భాషలున్నాయని, ఈ భాష మాట్లాడే గ్రామాల్లో భాషా వలంటీర్లను నియమించి అక్కడి విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పించాలన్నారు. మతోన్మాద సిద్ధాంతాలతో పాలన సాగిస్తున్న బీజేపీ ప్రభుత్వం మైనార్టీలు, క్రిస్టియన్లపై దాడులకు పాల్పడుతుండడం హేయమైన చర్యగా పేర్కొన్నారు. గిరిజన సంఘం జిల్లా గౌరవాధ్యక్షుడు మండంగి రమణ మాట్లాడుతూ బోయ వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చే అంశాన్ని ప్రభుత్వం విరమించుకోవాలని, ఐటీడీఏలకు నిధులు కేటాయించాలని, భాషా వలంటీర్లను రెగ్యులర్ చేయాలని, జీఓ నంబర్ 3ని అమలు పర్చాలని డిమాండ్ చేశారు. సదస్సులో ఏపీ గిరిజన సంఘం నాయకులు కోలక అవినాష్, మండంగి శ్రీనివాసరావు, మన్యం జిల్లాకు చెందిన గిరిజన ఉపాధ్యాయులు, గిరిజన సంఘం నాయకులు పాల్గొన్నారు.

యువకుడి దుర్మరణం

విజయనగరం క్రైమ్: డెంకాడ మండలం బొడ్డవలస పంచాయతీ, గెద్దవాని పాలెం గ్రామానికి చెందిన కోరాడ ప్రేమ్‌కుమార్ (19) సోమవారం ఆర్టీసీ బస్సు కింద పడి దుర్మరణం చెందాడు. ఈ ప్రమాదంపై రూరల్ పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ప్రేమ్‌కుమార్ గీతం కళాశాలలో ఇంజినీరింగ్ థర్డ్ ఇయర్ చదువుతున్నాడు. చెల్లి హర్షితతో కలిసి ఆధార్ కార్డ్ అప్‌డేట్ చేసుకునేందుకు గెద్దవానిపాలెం నుంచి విజయనగరం వస్తున్నాడు. స్థానిక డీమార్ట్ సమీపానికి వచ్చేసరికి విజయనగరం వెళ్తున్న ఆర్టీసీ బస్సు పక్క నుంచి బైక్‌పై వెళ్తున్న వీరికి తగలడంతో కింద పడిపోయారు. దీంతో ప్రేమ్‌కుమార్ బస్సు కిందకు వెళ్లిపోగా హర్షిత మరోవైపు పడిపోయింది. కిందకు పడిపోయిన ప్రేమ్‌కుమార్ తలపై నుంచి బస్సు వెళ్లిపోవడంతో తలభాగం నుజ్జునుజ్జయిపోవడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. తండ్రి శ్రీనివాసరావు, తల్లి దేవిల ఫిర్యాదు మేరకు రూరల్ ఎస్సై గణేష్ కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

కోటి కాంతుల ఉపాధి



పార్వతీపురం మండలంలో ఉపాధి హామీ పనులు చేస్తున్న వేతనదారులు

- మన్యంలో జోరుగా ఉపాధిహామీ పనులు
- ఈ ఏడాది 1.28 కోట్ల పనిదినాలు కల్పించాలన్నది లక్ష్యం
- ఇప్పటివరకు 56.23 లక్షల పనిదినాలు పూర్తి
- రోజూ 1.37లక్షల మందికి 'ఉపాధి'
- గరిష్ట వేతనం రూ.272 పొందేలా పనులు
- జిల్లా నుంచి ఇతర రాష్ట్రాలకు తగ్గిన వలసలు
- పనికి వచ్చినవారికే మస్తరు

పార్వతీపురం టౌన్:

పార్వతీపురం మన్యం జిల్లాలో జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పనులు జోరుగా సాగుతున్నాయి. పనిప్రదేశాలు వేతనదారులతో జాతరను తలపిస్తున్నాయి. 2023–24 సంవత్సరంలో కోటి 28 లక్షల పనిదినాల కల్పనే లక్ష్యంగా ప్రణాళికాబద్ధంగా పనులు సాగుతున్నాయి. జిల్లా నీటియాజమాన్య సంస్థ అన్ని పంచాయతీల్లో ఉపాధి హామీ పథకం కింద పనులు కల్పిస్తోంది. అడిగిన వారందరికీ 'ఉపాధి' చూపిస్తోంది. ప్రాజెక్టు డైరెక్టర్‌తో పాటు ఏపీడీలు, ఏపీఓలు ఉదయాన్నే గ్రామాలకు వెళ్లి వేతనదారులను చైతన్య పరుస్తున్నారు. దీంతో ప్రస్తుతం ప్రతి రోజూ 1.37 లక్షల మంది వేతనదారులు పనుల్లో పాల్గొంటున్నారు. ఏప్రిల్ 1 నుంచి ఇప్పటివరకు 56.23 లక్షల పనిదినాలు కల్పించారు. రానున్న రోజుల్లో 1.60 లక్షల మందికి పనికల్పించేలా పనుల ప్రణాళికను సిద్ధం చేశారు. అన్నిచోట్లా పనులు జరుగుతుండడంతో జిల్లా నుంచి ఇతర రాష్ట్రాలకు వలసలు చాలా వరకు తగ్గుముఖం పట్టాయని అధికారులు చెబుతున్నారు.

జల సంరక్షణ పనులకు ప్రాధాన్యత

ఉపాధి హామీ పథకం కింద జలసంరక్షణ పనులకు ప్రాధాన్యమిస్తున్నారు. చెరువుల్లోకి వర్షపు నీరు వెళ్లేందుకు ఫీడర్ చానల్‌లో పూడిక తీయించే పనులు ముమ్మరంగా చేస్తున్నారు. కాల్వల నుంచి పంట పొలాలకు వెళ్లే ఫీల్డ్ చానల్స్‌ను బాగు చేయిస్తున్నారు. అమృత్ సరోవర్లుగా గుర్తించిన చెరువులు, చెక్ డ్యామ్ పూడిక తీత పనులను ముమ్మరంగా చేపడుతున్నారు. మేజర్ కెనాల్స్, బౌండరీ ట్రెంచెస్, ఫారం పాండ్స్ తవ్వకాల పనులు జరుగుతున్నాయి. అవెన్యూ ప్లాంటేషన్, పండ్లతోటల అభివృద్ధికి ఉపాధి నిధులతోనే గుంతలు తవ్వుకునే పనులు కల్పిస్తున్నారు.



ఉపాధిహామీ పనులను పరిశీలిస్తున్న అధికారులు

2019 నుంచి జిల్లాలో ఉపాధి పనుల కల్పన ఇలా..	
సంవత్సరం	కల్పించిన పని దినాలు (లక్షల్లో)
2019–20	95.29
2020–21	94.29
2021–22	97.23
2022–23	107.22
2023–24	56.23 (ఇప్పటివరకు)

వేతనం తగ్గకుండా..

ఉపాధి హామీ వేతనదారుల గరిష్ట వేతనం రూ.272 ఉంది. వేతనదారులందరూ అధిక వేతనం అందుకునేలా ఉపాధిహామీ సిబ్బంది కొలతలు వేసి రెండు పూటలా పనులు కల్పిస్తున్నారు. జిల్లాలోని వేతనదారులు సగటున రూ.265 వేతనం పొందుతున్నారు. బలిజిపేట, మక్కువ, జియ్యమ్మవలస, కురుపాం మండలాలు పనుల కల్పనలో ముందంజలో ఉన్నాయి. పాచిపెంట, సీతంపేట, గుమ్మలక్ష్మీపురం మండలాల్లో సగటు వేతనం రూ.271 పొందుతున్నారు.

అక్రమాలకు తావు లేకుండా...

ఉపాధి హామీ పథకం అక్రమాలకు తావులేకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నారు. నేషనల్ మొబైల్ మానిటరింగ్ సిస్టమ్ (ఎన్ఎంఎంఎస్) ద్వారా కూలీలకు మస్తర్లు వేస్తున్నారు. ప్రతిరోజు రెండుసార్లు ఎన్ఎంఎంఎస్ ద్వారా మస్తర్లు వేస్తుండడంతో అక్రమాలు తగ్గేందుకుఅవకాశంకలిగింది.

అడిగిన వారందరికీ పని



అడిగిన వారందరికీ పనులు కల్పిస్తున్నాం. వ్యవసాయ పనులు పూర్తియినప్పటి నుంచి అన్ని గ్రామ పంచాయతీల్లో ఉపాధి హామీ పనులు చేపట్టాం. 2023–24లో కోటి 28 లక్షల పనిదినాలు కల్పించాలనేది లక్ష్యం. ఏప్రిల్ 1 నుంచి ఇప్పటి వరకు 56.23 లక్షల పని దినాలు కల్పించాం. ఉపాధి పనులకు వచ్చే వారందరూ గరిష్ట వేతనం పొందేలా చర్యలు తీసుకుంటున్నాం. అక్రమాలకు తావు లేకుండా ఎన్ఎంఎంఎస్ యాప్‌లో హాజరు వేసి ఫొటో అప్‌లోడ్ చేసే ప్రక్రియను చేపట్టాం. ఈ ప్రక్రియ రోజుకు రెండు సార్లు చేపడుతున్నాం.

– రామచంద్రరావు, డ్వామా పీడీ, పార్వతీపురం మన్యం

ట్రిపుల్ ఐటీలో సీటు వస్తే.. భవిష్యత్తు బంగారమే



ఐఐఐటీ క్యాంపస్‌లో విద్యార్థులు

- పదోతరగతిలో ప్రతిభావంతులకు సువర్ణావకాశం
- సీటు వచ్చిన వారికి చదువుతో పాటు ఉద్యోగం గ్యారంటీ
- దరఖాస్తుకు ఈ నెల 26 వరకు గడువు

విజయనగరం పూల్‌బాగ్:

ట్రిపుల్ ఐటీలు... చదువులో ప్రతిభ చూపే పేదవిద్యార్థుల భవిష్యత్తును బంగారుమయం చేసే సరస్వతీ నిలయాలు. రాష్ట్రంలోని నూజివీడు, ఇడుపులపాయ, శ్రీకాకుళం, ఒంగోలు ఉన్న రాజీవ్ గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం (ఆర్జీయూకేటీ)లో 2023-24 విద్యా సంవత్సరంలో బీటెక్ సమీకృత ఇంజినీరింగ్ కోర్సులో ప్రవేశాలకు ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేసింది. ఒక్కో క్యాంపస్‌లో వెయ్యిసీట్లను భర్తీ చేయనున్నారు. ఈడబ్ల్యూఎస్ కోటా సీట్లు మరో 100 ఉన్నాయి. అర్హులైన అభ్యర్థులు ఈ నెల 4 నుంచి 26వ తేదీ సాయంత్రం 5 గంటల్లోగా ఆన్‌లైన్లో దరఖాస్తులు సమర్పించాలని వర్సిటీ సూచించింది.



అర్హతలు ఇలా...

అభ్యర్థులు 2023లో తొలి ప్రయత్నంలోనే ఎస్ఎస్‌సీ లేదా తత్సమాన పరీక్షల్లో రెగ్యులర్ విద్యార్థిగా ఉత్తీర్ణులై ఉండాలి. వయసు 31 డిసెంబర్ 2023 నాటికి 18 ఏళ్లు నిండకుండా ఉండాలి. ఎస్సీ, ఎస్టీ కేటగిరీ అభ్యర్థులకైతే 21 ఏళ్లు దాటకూడదు. అభ్యర్థులు ఏపీ ఆన్‌లైన్ సెంటర్ ద్వారా ఆర్జీయూకేటీ వెబ్‌సైట్లో దరఖాస్తు చేసుకోవాలి. ఓసీ, బీసీ అభ్యర్థులు దరఖాస్తు రుసుము కింద రూ.300, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు రూ.200 చెల్లించాలి. ఏపీ ఆన్లైన్ సెంటర్లు ఇచ్చే రసీదును భద్రపరుచుకోవాలి. పదో తరగతిలో వచ్చిన మార్కుల ఆధారంగా మెరిట్ పద్ధతిలోనే ప్రవేశాలు కల్పిస్తారు. నాన్ రెసిడెన్షియల్ ప్రభుత్వ స్కూళ్లు, జిల్లా పరిషత్ హైస్కూళ్లు, మున్సిపల్ హైస్కూళ్లలో చదివిన విద్యార్థులకు వారి మార్కులు 4 శాతం డిప్రెవేషన్ స్కోర్‌ను అదనంగా కలుపుతారు. దీనిని సాంఘికంగా, ఆర్థికంగా వెనుకబాటుకు గురైన విద్యార్థులకు ఇచ్చే వెయిటేజీగా పేర్కొన్నారు. 85 శాతం సీట్లను స్థానికంగాను, 15 శాతం సీట్లను మెరిట్ కోటాలో ఏపీ, తెలంగాణ విద్యార్థులకు కేటాయిస్తారు. అలాగే, ఎస్సీలకు 15 శాతం, ఎస్టీలకు 6 శాతం, బీసీ–ఏకు 7 శాతం, బీసీ–బీకి 10 శాతం, బీసీ–సీకి 1 శాతం, బీసీ–డీకి 7 శాతం, బీసీ–ఈకి 4 శాతం చొప్పున రిజర్వేషన్ అమలు చేస్తారు. ప్రత్యేక సీట్లు కింద దివ్యాంగులకు 5 శాతం, సైనిక ఉద్యోగుల పిల్లలకు 2 శాతం, స్పోర్ట్స్ కోటాలో 1 శాతం, ఎన్‌సీసీ కోటా కింద 0.5 శాతం, భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ కోటాలో 0.5 శాతం సీట్లను భర్తీ చేస్తారు. ప్రతి కేటగిరీలోనూ 33.33 శాతం సీట్లను సమాంతరంగా బాలికలకు కేటాయిస్తారు.

గ్రేడ్ పాయింట్లు సమానమైతే ఎంపిక ఇలా..

దరఖాస్తు చేసుకున్న విద్యార్థుల్లో సంబంధిత కేటగిరీలో ఏ ఇద్దరి విద్యార్థుల మార్కులు సమానమైనా.. గణితం, జనరల్ సైన్స్, ఇంగ్లిష్, సోషల్ సబ్జెక్టులలో ఎక్కువ గ్రేడ్ వచ్చిన వారిని ఎంపిక చేస్తారు. ఇవన్నీ కూడా సమానంగా ఉంటే ఫస్ట్ లాంగ్వేజ్ ఎక్కువ గ్రేడ్ వచ్చిన వారిని ఎంపిక చేస్తారు. పుట్టిన తేదీ ఆధారంగా కూడా ఎంపిక చేస్తారు. ఇవన్నీ సమానంగా ఉంటే హాల్‌టిక్కెట్ నంబర్ ఆధారంగా ఎంపిక చేస్తారు. దరఖాస్తులో అడ్రస్, ఫోన్ నంబర్ తప్పనిసరిగా పేర్కొనాలి.

పేద విద్యార్థులకు సువర్ణావకాశం



ఐఐఐటీలో ప్రవేశం అనేది పేద విద్యార్థులకు సువర్ణావకాశం. ఇంటర్, బీటెక్ చదువుతో పాటు క్యాంపస్ ప్లేస్‌మెంట్స్ లభిస్తాయి. మంచి భవిష్యత్తు ఉంటుంది. అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి. ఈ ఏడాది జిల్లాలో 500కి పైగా మార్కులు సాధించిన విద్యార్థులు 1930 మంది ఉన్నారు.

– టి సన్యాసిరాజు, డీసీఈబీ సెక్రటరీ, విజయనగరం

మంచి అవకాశం



నెల్లిమర్ల మండలం సతివాడ మోడల్‌స్కూల్‌లో పదవ తరగతి చదువుకున్నాను. 2017–18లో 10కి పది గ్రేడ్ పాయింట్లు సాధించడంతో నూజివీడు ఐఐఐటీలో సీటు వచ్చింది. ప్రస్తుతం బీటెక్ పూర్తిచేసి, ఎంటెక్‌లో ప్రవేశానికి సిద్ధమవుతున్నాను. మాలాంటి విద్యార్థులకు మంచి అవకాశం ఇది.

– లెంక ధర్మారావు, మెకానికల్ ఇంజినీరింగ్ విభాగం పూర్వ విద్యార్థి

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి ఆత్మహత్య

విజయనగరం క్రైమ్: స్థానిక కొణిసి వీధిలో నివాసం ఉంటున్న మేడపాటి నాగిరెడ్డి (36) ఆత్మహత్య పలు అనుమానాలకు దారి తీస్తోంది. ఈ సంఘటన వివరాలిలా ఉన్నాయి. నాగిరెడ్డి టీటైమ్‌లో పనిచేస్తున్నాడు. పదేళ్ల కిందట సిరి అనే యువతితో పెళ్లయింది. వీరికి పాప ఉంది. భార్యాభర్తల మధ్య మనస్పర్థలు రావడంతో ఇద్దరూ వేర్వేరుగా ఉంటున్నారు. నాగిరెడ్డి కొంతకాలంగా ఆర్థికసమస్యలతో సతమతమవుతున్నాడు. ఆదివారం విధులకు కూడా హాజరుకాలేదని టీటైమ్ యజమాని చెప్పినట్లు పోలీసులు తెలిపారు. అయితే సోమవారం ఉదయం కుళాయిలు రావడంతో పక్కనే ఉంటున్న మహిళ ఎంతసేపటికీ పిలిచినా రాకపోయేసరికి కిటికీ తలుపులు తెరిచింది. లోపల నాగిరెడ్డి కరెంట్ వైర్లు ఛాతీపై పెట్టుకుని పడి ఉండడాన్ని చూసి వైఎస్ఆర్‌నగర్‌లో పాపతో ఉంటున్న భార్య సిరికి సమాచారం అందించింది. ఈ విషయం తెలుసుకున్న టూటౌన్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. విద్యుత్ సరఫరా నిలిపివేసి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేంద్రాస్పత్రికి తరలించారు. ఈ విషయమై మృతుని భార్యతో పాటు కుటుంబసభ్యులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై షేక్ శంకర్ తెలిపారు.

సంతృప్తికర పరిష్కారం చూపాలి

- కలెక్టర్ నిషాంత్‌కుమార్

పార్వతీపురం: 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమంలో సమస్యలను తెలియజేసిన అర్జీదారులకు సంతృప్తికర పరిష్కారం చూపాలని పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ నిషాంత్ కుమార్ అధికారులను ఆదేశించారు. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో నిర్వహించిన జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి సి.విష్ణుచరణ్, జిల్లా రెవెన్యూ అధికారి జె. వెంకటరావుతో కలిసి ప్రజల నుంచి ఆయన అర్జీలు స్వీకరించారు. ప్రజల సమస్యల గురించి సంబంధిత అధికారులతో వెంటనే మాట్లాడి సమస్య పరిష్కారానికి ఆదేశాలిచ్చారు. జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో ప్రజలు సామాజిక, వ్యక్తిగత సమస్యలను పరిష్కరించవలసిందిగా కోరుతూ 72 వినతులు అందించారు. కార్యక్రమంలో జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ కె. రామచంద్రరావు, డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ పి. కిరణ్ కుమార్, జిల్లా ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజినీరింగ్ అధికారి ఒ.ప్రభాకర రావు, గ్రామ, పౌర సరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ ఎం.డి.నాయక్, జిల్లా గ్రామ పంచాయతీ అధికారి బలివాడ సత్యనారాయణ, ఇతర జిల్లా అధికారులు పాల్గొన్నారు.

మూడు పూరిళ్లు దగ్ధం

సీతానగరం: మండలంలోని కృష్ణారాయపురంలో ఆదివారం అర్ధరాత్రి సంభవించిన అగ్ని ప్రమాదంలో మూడు పూరిళ్లు దగ్ధం కాగా ఒక ఇంట్లో వంట గ్యాస్ సిలిండర్ పేలిభారీ శబ్దం రావడంతో గాఢ నిద్రలో ఉన్న ప్రజలు ఉలిక్కిపడ్డారు. వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన గొరజాన జగన్నాథం ఇంటిపై విద్యుత్ వైర్లు రాపాడిన కారణంగా మంటలు ఏర్పడి అగ్నిప్రమాదం సంభవించింది. ఈ ప్రమాదంలో జగన్నాథం పూరిల్లుతో పాటు ఆ ఇంటిని ఆనుకుని ఉన్న యాళ్ల సత్యంనాయుడు, గొరజాన సోములమ్మల ఇళ్లు పూర్తిగా కాలిపోయాయి. జగన్నాథం ఇంట్లో ఉన్న వంటగ్యాస్ సిలిండర్ అగ్నిధాటికి పేలి భారీ శబ్దం వచ్చింది. గ్రామవలంటీర్లు అగ్నిమాపక కార్యాలయానికి సమాచారం ఇందించడంతో సిబ్బంది వచ్చి మంటలను అదుపులోకి తెచ్చారు.

వ్యాన్ ఢీకొని మహిళ మృతి

- మరొకరికి గాయాలు

సీతానగరం: మండలంలోని రాష్ట్ర రహదారిలో సోమవారం ఉదయం లచ్చయ్యపేట వద్ద పార్వతీపురం నుంచి బొబ్బిలి వెళ్తున్న బొలెరో వ్యాన్ అదుపు తప్పి రోడ్డు పక్కనుంచి వెళ్తున్న మహిళను ఢీకొట్టడంతో అక్కడికక్కడే దుర్మరణం చెందింది. అదే వ్యాన్ రోడ్డుపక్కనే ఉన్న మంగలి షాపును నిర్వహిస్తున్న పెంటయ్యను ఢీకొట్టడంతో తీవ్ర గాయాలపాలయ్యాడు. ప్రమాదానికి గల కారణాలపై సర్పంచ్ సీహెచ్ కృష్ణతోపాటు గ్రామస్తులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. బొబ్బిలి మండలం కోమటిపల్లి గ్రామానికి చెందిన పార్వతమ్మ(48) సీజన్ల వారీగా ఉత్పత్తి అయ్యేపళ్లు, కాయలు లచ్చయ్యపేటకు తెచ్చి విక్రయిస్తుంది. ఈ క్రమంలో సోమవారం ఉదయం మామిడి పళ్ల తట్ట తెచ్చి రోడ్డుకు పక్కన ఉన్న ఇళ్లకు వెళ్లి విక్రయించడానికి సిద్ధం చేసింది. అంతలో బొలెరో వ్యాన్ వచ్చి ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందింది. అలాగే లచ్చయ్యపేట గ్రామానికి చెందిన నాయీబ్రాహ్మణుడు ఎ.పెంటయ్య దినసరి చర్యలు చేపట్టడం కోసం సోమవారం తనబడ్డీవద్ద కూర్చున్న సమయంలో వ్యాన్ దూసుకుని వచ్చి ఢీకొట్టడంతో కాలికి బలమైన గాయాలయ్యాయి. అనంతరం వ్యాన్ ఎదురుగా రోడ్డు పక్కనే ఉన్న కాలువలో విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టి ఆగింది. గాయాలపాలైన పెంటయ్యను 108 వాహనంలో చికిత్స నిమిత్తం పార్వతీపురం ప్రభుత్వాస్పత్రికి తరలించారు.



పార్వతమ్మ మృతదేహం

బాక్సింగ్ పోటీలకు జిల్లా జట్లు సిద్ధం

- ఈనెల 9 నుంచి 11వరకు విజయవాడలో పోటీలు

విజయనగరం: రాష్ట్రస్థాయిలో విజయవాడలో జరగనున్న జూనియర్స్ బాల, బాలికల బాక్సింగ్ పోటీల్లో పాల్గొనబోయే జిల్లా జట్ల ఎంపిక పోటీలు సోమవారం ఉత్సాహభరిత వాతావరణంలో సాగాయి. జిల్లా బాక్సింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నగరంలోని రాజీవ్ క్రీడామైదానం ప్రాంగణంలో గల బాక్సింగ్ హాల్‌లో నిర్వహించిన పోటీలను బాక్సింగ్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డోలా మన్మథకుమార్ ప్రారంభించారు. ఈ ఎంపిక పోటీలకు జిల్లా నలుమూలల నుంచి 50 మంది క్రీడాకారులు హాజరుకాగా..13 విభాగాల్లో 13 మంది బాలుర క్రీడాకారులను, 4 గురు బాలికలను రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేశారు. జిల్లా జట్టుకు అర్హత సాధించిన క్రీడాకారులు ఈనెల 9 నుంచి 11వ తేదీ వరకు విజయవాడలో జరగనున్న అంతర్ జిల్లాల పోటీల్లో జిల్లా తరఫున ప్రాతినిధ్యం వహించనున్నట్లు మన్మథకుమార్ తెలిపారు. రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులు ఉత్తమ ప్రతిభ కనబరిచి జాతీయ పోటీలకు అర్హత సాధించడం ద్వారా ఉజ్వల భవిష్యత్‌కు బాటలు వేసుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో శాప్‌కోచ్ బి.ఈశ్వర రావు, బాక్సింగ్ అసోసియేషన్ ప్రతినిధులు ఎస్‌ఈ. రాజు, డి.మురళి, గౌరి, పైడిరాజు, బాక్సింగ్ రింగ్ ఆఫీషియల్స్ వి.సంతోష్‌కుమార్, పి.శ్రీనివాసరావు, కె.శంకర్ తదితరులు పాల్గొన్నారు.



జిల్లా బాక్సింగ్ జట్ల ఎంపిక పోటీలను ప్రారంభిస్తున్న బాక్సింగ్ అసోసియేషన్ ప్రతినిధులు

హోరాహోరీగా ఉమెన్స్ టీ-20 ప్రీమియర్ లీగ్

విజయనగరం: ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉమెన్స్ టీ–20 క్రికెట్ లీగ్ పోటీలు రెండవ రోజు హోరా హోరీగా సాగాయి. డెంకాడ మండలం చింతలవలసలో గల డాక్టర్ పీవీజీ రాజు ఏసీఏ స్పోర్ట్స్ కాంప్లెక్స్ ఆవరణలో జరుగుతున్న టోర్నీలో భాగంగా సోమవారం ఉదయం విజయనగరం రాయల్స్– రాయలసీమ క్వీన్స్ జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో 5 వికెట్ల తేడాతో రాయలసీమ క్వీన్స్ జట్టు విజయం సాధించింది.

బెజవాడ బ్లేజర్స్‌పై వైజాగ్ డాల్ఫిన్స్ జయకేతనం

ఇదే మైదానంలో మధ్యాహ్నం జరిగిన మరో మ్యాచ్‌లో బెజవాడ బ్లేజర్స్‌పై వైజాగ్ డాల్ఫిన్స్ జయకేతనం ఎగురవేసింది.



బెజవాడ బ్లేజర్స్ జట్టుపై విజయం సాధించిన వైజాగ్ డాల్ఫిన్స్ జట్టు

9న చీపురుపల్లిలో మెగా జాబ్‌మేళా

- సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ నాగలక్ష్మి ఎస్ పిలుపు



జాబ్‌మేళా పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ నాగలక్ష్మి, జేసీ మయూర్ అశోక్



సమగ్ర వివరాలున్న జాబ్‌మేళా పోస్టర్

విజయనగరం అర్బన్: చీపురుపల్లిలో ఈ నెల 9వ తేదీన మెగా జాబ్‌మేళాను ఏర్పాటు చేస్తున్నామని నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ నాగలక్ష్మి ఎస్ పిలుపునిచ్చారు. ఈ మేరకు స్థానిక కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన కార్యక్రమంలో జాబ్‌మేళాకు సంబంధించిన పోస్టర్‌ను ఆమె ఆవిష్కరించారు. కార్యక్రమంలో జేసీ మయూర్ అశోక్, ట్రైనీ కలెక్టర్ సహాదిత్ వెంకట త్రివినాగ్, డీఆర్‌ఓ ఎం.గణపతిరావు, ఎస్‌డీసీలు సూర్యనారాయణ, సుదర్శనదొర, జిల్లా నైపుణ్య అభివృద్ధి అధికారి ఎస్. గోవిందరావు పాల్గొన్నారు.

జాబ్ మేళా వివరాలు

చీపురుపల్లిలోని లావేరురోడ్డులో గల జిల్లా పరిషత్ బాలురపాఠశాలలో ఉదయం 9 గంటలకు మెగా జాబ్ మేళా ప్రారంభమవుతుంది. ఈ జాబ్‌మేళాకు హాజరయ్యే యువతీయువకులు ముందుగానే తమ పేర్లను 'ఆర్‌బీ.జీవై/వివైఈవైక్యూ' వెబ్‌సైట్‌లో రిజిస్టర్ చేసుకోవాలి. వయసు 18–35 ఏళ్ల మధ్య ఉండి, తగిన విద్యార్హతలు కలిగినవారు, తమ రెజ్యూమ్, సర్టిఫికెట్లు, జెరాక్స్ కాపీలు, ఫొటోలు, ఇతర పత్రాలు తీసుకుని మేళాకు హాజరుకావాలి. ఎస్ఎస్‌సీ, ఇంటర్మీడియట్, ఐటీఐ, డిప్లమో, డిగ్రీ, బీటెక్ విద్యార్హతలు ఉండాలి. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలలో పనిచేయాల్సి ఉంటుంది.

జాబ్‌మేళాలో పాల్గొనే సంస్థలు

ఆర్‌అండ్‌ఆర్ ఎక్స్‌ట్రీమ్ సొల్యూషన్స్, ఏటీసీ టైర్స్, ఏపీ ప్రైవేట్ లిమిటెడ్, అరబిందో ఫార్మా లిమిటెడ్, ఎంఎస్ఎన్ ల్యాబొరేటరీస్, సినాప్టక్స్ ల్యాబ్స్, హెటిరో డ్రగ్స్, డెక్కన్ కెమికల్స్, వరుణ్ మోటార్స్, మోహన్ స్పిన్‌టెక్స్ ఇండియా లిమిటెడ్, జయభేరి ఆటోమోటివ్స్, అపోలో ఫార్మా, మెడ్‌ప్లస్, గ్రీన్‌టెక్ ఇండస్ట్రీస్, ర్యాండ్‌స్టాండ్, (బైజూస్, ఎస్‌బీఐ కార్డ్స్, కిన్నెర కేపిటల్స్, మత్తూట్ ఫైనాన్స్), కాగ్నెంట్ ఈ–సర్వీసెస్, సెన్సాకోర్ మెడికల్ ఇన్‌స్ట్రుమెంటేషన్, టీసీఎస్, శార్వాణీ స్వీట్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థలు జాబ్‌మేళాలో పాల్గొంటున్నాయి.

ఎంపిక చేసే ఉద్యోగాలు

డేటా ఎంట్రీ ఆపరేటర్, సాఫ్ట్‌వేర్ ట్రైనీ, ఉమెన్ అప్రెంటిస్ ట్రైనీస్, ప్రొడక్షన్ అప్రెంటిస్ ట్రైనీస్, జూనియర్ ఎగ్జిక్యూటివ్ ట్రైనీస్, ప్రొడక్షన్/క్యూసీ/క్యూఏ/ఆర్‌అండ్‌డీ/మెయింటనెన్స్, ట్రైనీ కెమిస్ట్, సేల్స్ ఎగ్జిక్యూటివ్, హెల్పర్స్, టెక్నీషియన్స్, ఆపరేటర్స్, సర్వీస్ అడ్వయిజర్స్, జూనియర్/సీనియర్ టెక్నీషియన్స్, సిస్టమ్ ఆపరేటర్స్, అకౌంటెంట్స్, డెంటార్, వెయిటర్స్, కస్టమర్ కేర్ ఎగ్జిక్యూటివ్స్, టెలికాలర్స్, ఫార్మసిస్ట్స్, ఫార్మసీ అసిస్టెంట్స్, రిటైల్ ట్రైనీ అసోసియేట్స్, ఫార్మా ఎయిడ్స్, అప్రెంటిస్ వేర్‌హౌస్ అసిస్టెంట్స్, ఐటీ ఎగ్జిక్యూటివ్స్, డెలివరీ బాయ్స్, ప్రాపర్టీ హంటర్స్, మెషిన్ ఆపరేటర్స్, బిజినెస్ డెవలప్‌మెంట్ అసోసియేట్స్, బ్రాంచ్ రిలేషన్‌షిప్ ఎగ్జిక్యూటివ్స్, టీఎల్, బ్రాంచ్ రిలేషన్‌షిప్ మేనేజర్స్, కంప్యూటర్ ఆపరేటర్స్, డీఐపీ కాలర్స్, కస్టమర్ సపోర్ట్ ఎగ్జిక్యూటివ్స్ (నాన్ వాయిస్), మెషిన్ ఆపరేటింగ్ అసెంబ్లింగ్, విజువల్ ఇన్‌స్పెక్షన్, షోల్డరింగ్, డీ బగ్గింగ్, టెస్టింగ్, ఎంఎఫ్‌జీ ఆపరేటర్స్, క్యాషియర్, సేల్స్ అసోసియేట్స్, అవుట్‌లెట్ సూపర్‌వైజర్స్, సెక్యూరిటీ, మార్కెటింగ్ అసోసియేట్స్, హెల్పర్స్ కేటగిరి పోస్టులు ఉన్నాయి.

సంప్రదించాల్సిన ఫోన్ నెంబర్స్:

ఏపీఎస్ఎస్‌డీసీ హెల్ప్‌లైన్: 9988853335,
జిల్లా స్కిల్‌హబ్ కో-ఆర్డినేటర్స్: 9010023033, 7286042743.
ప్లేస్‌మెంట్ ఎగ్జిక్యూటివ్: 9000102013.